

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శని) సా.6.24
సహరీ (ఆది) ఉ.4.43

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	33	26



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

శిథిలావస్థకు చేరిన కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించొద్దు

» రిటర్నింగ్ అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశం

అమలాపురం టౌన్, మార్చి 22: శిథిలావస్థకు చేరిన కేంద్రాల్లో పోలింగ్ నిర్వహించరాదని కలెక్టర్ హిమాన్షు శుక్లా రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఈవీఎంలను పరిశీలించాలని, పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. సీ-విజిల్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. ఆరు సరిహద్దు చెక్ పోస్టుల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో ఎన్నికలను ప్రజాస్వామ్య స్ఫూర్తితో సజావుగా నిర్వహించడానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆర్వోలను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తొలుత ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లా రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీతో సమన్వయపరుచుకుని శాంతి భద్రతలను కాపాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ నిర్వహణకు సంబంధించిన విధి విధానాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన అత్యవసర సేవలో ఉన్న 31 శాఖలకు సంబంధించి, ఎన్నికల కవరేజ్‌లో నిమగ్నమయ్యే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, రిటర్నింగ్ అధికారులైన ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, ఎస్వీవీ సత్యనారాయణ, ఎస్.సుధాసాగర్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు డి.ఎల్లారావు, మదన్‌మోహనరావు, జడ్పీ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, అమలాపురం లోక్‌సభ సహాయ రిటర్నింగ్ అధికారి ఎం.ఝాన్సీరాణి, ఎన్నికల సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న జేసీ నుపూర్‌అజయ్

దివ్యాంగులకు 'హోం ఓటింగ్' విధానం

అమలాపురం టౌన్, మార్చి 22: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో దివ్యాంగుల కోసం హోం ఓటింగ్ విధానాన్ని ఎన్నికల సంఘం అందుబాటులోకి తీసుకొచ్చిందని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ తెలిపారు. మంచానికే పరిమితమైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కృత్రిమ అవయవాలు, మూడు చక్రాల వాహనాలపై తిరిగే దివ్యాంగులు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును సద్వినియోగపరుచుకుని ఓటర్లకు స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. 'సక్షం' యాప్ ద్వారా దివ్యాంగులు పోలింగ్ రోజున ఓటు వేసేందుకు వెళ్లినప్పుడు అవసరమైన సౌకర్యాల కోసం దరఖాస్తు చేసుకోవాలని.. ఆ ప్రకారం అధికారులు చర్యలు చేపడతారని ఆమె పేర్కొన్నారు. విభిన్న ప్రతిభావంతులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని జేసీ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా అమలాపురం జీఎంసీ బాలయోగి స్టేడియంలో శుక్రవారం దివ్యాంగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ధృఢమైన ప్రజాస్వామ్యానికి దివ్యాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మీ ఓటే భవిష్యత్తును నిర్దేశిస్తుందన్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వీప్ నోడల్ అధికారి మధుసూదనరావు మాట్లాడుతూ 2019 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 83 శాతం ఓటింగ్ నమోదు కాగా ఈసారి ఓటింగ్ శాతాన్ని మరింత పెంచే దిశగా ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపట్టిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి బీవీ రమణ, అమలాపురం మున్సిపల్ కమిషనరు ఎస్.మనోహర్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, ఏపీడీ ఎంఎం జిలానీ పాల్గొన్నారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తూ దివ్యాంగులు చేపట్టిన ర్యాలీని జేసీ జెండా ఊపి ప్రారంభించి వారితో కలిసి పాల్గొన్నారు.

పదో తరగతి గణితం పరీక్ష ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 22: జిల్లాలో పదో తరగతి గణితం పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. 112 కేంద్రాల్లో 19,991 మందికి గాను 19,340 మంది విద్యార్థులు హాజరయ్యారు. 651 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీస్ జరగలేదని డీఈవో ఎం.కమలకుమారి తెలిపారు. డీఈవో ఆరు, కమిషనర్ ఎన్.సురేష్ ఐదు, డీవైఈవో ఎన్.ఫణి ఎనిమిది, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 31 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

గెలిచి.. చంద్రబాబుకు కానుకగా ఇస్తాను



నా పుట్టినరోజున టిక్కెట్ ప్రకటించి చంద్రబాబు నాకు గిఫ్ట్ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజలను సంఘటితం చేసుకుని ఎన్నికల్లో వ్యూహాత్మకంగా పని చేస్తా. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా మన విజయం సాధిస్తా. అమలాపురం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబుకు కానుకగా ఇస్తాను.

- గంటి హరీష్‌మాధుర్, అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి

చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుంటా...



గత ఐదేళ్లలో అంకితభావంతో చేసిన సేవలను టీడీపీ అధిష్ఠానం గుర్తించి మరోసారి అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నన్ను ప్రకటించింది. దుర్మార్గ పాలన అందిస్తున్న జగన్‌కు గుణపాఠం చెప్పేందుకు ఓటర్ల ముందుకు వెళ్లి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేస్తాను. నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

- అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి

కాకినాడ సిటీలో గెలిచి చూపిస్తా...



చంద్రబాబు నాపై ఎంతో నమ్మకంతో ఈ సీటు కేటాయించారు. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కాకినాడ సిటీలో గెలిచి చూపిస్తా. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ఎన్నికల బరిలో దిగుతాను. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలే ఉమ్మడి అభ్యర్థుల విజయానికి దోహదపడతాయి.

- వనమాడి కొండబాబు, కాకినాడ సిటీ టీడీపీ అభ్యర్థి



» టీడీపీ మూడో జాబితా విడుదల
» రెండు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన
» కాకినాడ సిటీకి కొండబాబు
» అమలాపురానికి ఆనందరావు
» అమలాపురం లోక్‌సభకు హరీష్‌మాధుర్
» మిగిలింది రాజమండ్రి లోక్‌సభ
» ఉమ్మడి జిల్లాలో 21 స్థానాలకు ఎంపిక
» నేడు పి.గన్నవరం అభ్యర్థి ప్రకటన
» అభ్యర్థులు మంగళగిరి పయనం

టీడీపీ టిక్కెట్లపై ఉత్కంఠ వీడింది.. నిన్నటి వరకు కాకినాడ సిటీ, అమలాపురం టిక్కెట్లపై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. ఎవరు బరిలో ఉంటారు.. ఎవరు ఉండరనే దానిపై.. ఏ పార్టీ నుంచి పోటీ ఉంటుందనే దానిపై రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తూ వచ్చారు. ఎట్టకేలకు టీడీపీ మూడో జాబితా విడుదల చేసి సస్పెన్స్‌కు తెరదించింది. ఇక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం లోక్‌సభ, పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి తేలవలసి ఉంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి/ అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠకు తెరపడింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన దాదాపు పూర్తయింది. టీడీపీ శుక్రవారం విడుదల చేసిన మూడో జాబితాలో కాకినాడ సిటీ అసెంబ్లీ, అమలాపురం అసెంబ్లీ, అమలాపురం లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి ఉత్కంఠకు తెరదించింది. కాకినాడ సిటీ నియోజకవర్గంలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని బలంగా ఢీకొట్టగలిగే నేతను ఎంపిక చేయడంపై పార్టీ హైకమాండ్ దృష్టి సారించింది. సామాజికవర్గ సమతూకంపైనా కసరత్తు చేసింది. చివరకు మత్స్యకార సామాజికవర్గానికే సీటు కేటాయించింది. దీనిలో భాగంగా ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి అయిన మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబువైపే మొగ్గు చూపింది. ఆయన్నే అభ్యర్థిగా ఖాయం చేసింది. ఇదిలా ఉండగా కోనసీమ జిల్లాలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అమలాపురం అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ప్రకటించారు. అడుగడుగునా ఆటంకాలను ఎదుర్కొని అమలాపురం అసెంబ్లీ సీటు దక్కించుకున్నారు. ఇందుకు మాజీ మంత్రి దివంగత మెట్ల సత్యనారాయణ తనయుడు రమణబాబుతో పాటు ఆయన వర్గం నేతలు చేసిన కృషి ఫలించింది. పార్టీ కోసం అహర్నిశలూ శ్రమించే అయితాబత్తుల ఆనందరావును అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడంతో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి కార్యకర్తల్లో జోష్ పెరిగింది. మిగిలిన పి.గన్నవరం ఎస్సీ రిజర్వుడు స్థానానికి జనసేన అభ్యర్థిని శనివారం అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది. అమలాపురం లోక్‌సభ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా లోక్‌సభ దివంగత స్పీకర్ బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్‌ను ఎంపిక చేసింది. టీడీపీ అధిష్ఠానానికి అత్యంత విధేయుడిగా ఉన్న హరీష్‌మాధుర్‌కే అమలాపురం లోక్‌సభ అభ్యర్థిత్వం కట్టబెట్టింది. అమలాపురం లోక్‌సభ సీటు కోసం హరీష్‌తో పాటు ఐఏఎస్ అధికారి సతీమణి డాక్టర్ సత్యశ్రీ, పారిశ్రామికవేత్త యాతాటి రమేష్‌బాబు ప్రయత్నించారు. సత్యశ్రీ పట్ల అధిష్ఠానం చివరి క్షణం వరకు ఒకింత సానుకూలతతో ఉన్నప్పటికీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కీలక భూమిక వహించడంతో టిక్కెట్ హరీష్‌నే వరించింది. అయినవిల్లి సిద్ధివినాయక స్వామి ఆలయంలో పూజలు చేసే సమయంలో హరీష్‌ను అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయనకు బర్త్‌డే గిఫ్ట్ ఇచ్చారంటూ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

21 స్థానాలకు అభ్యర్థుల ప్రకటన

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 22 అసెంబ్లీ స్థానాలు ఉండగా 21 స్థానాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల ఎంపిక మొత్తం పూర్తయింది. అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో అభ్యర్థుల ఎంపికపై టీడీపీ, జనసేన పార్టీలు ఎట్టకేలకు స్పష్టత నిచ్చేశాయి. ఇన్నాళ్లు కొన్ని సీట్లపై పీటముడి కొనసాగింది. శుక్రవారం మిగిలిన రెండు సీట్లు ప్రకటించడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఒక్క స్థానం మినహా అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. కాకినాడ లోక్‌సభ పరిధిలోని ఏడు స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక తేలిపోయింది. మొత్తం ఏడు సీట్లలో టీడీపీ ఐదుచోట్ల, జనసేన రెండుచోట్ల పోటీ చేయడం ఖాయమైంది. ఇటీవల పవన్ పిఠాపురం సీటు నుంచి తానే పోటీ చేస్తున్నట్టు స్వయంగా వెల్లడించడంతో సస్పెన్స్ వీడింది. కాకినాడ సిటీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం జరిగింది. టీడీపీ మాత్రం ఈ స్థానంపై ఎడతెగని కసరత్తు చేసింది. ప్రత్యర్థి వైసీపీ తరపున ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆర్థికంగా బలంగా ఉండడంతో అదే స్థాయిలో బలమైన అభ్యర్థిని నిలబెట్టే ఉద్దేశంతో టీడీపీ అధిష్ఠానం ఈ సీటుపై వ్యూహాత్మకంగా కదిలింది. ఇతర సామాజికవర్గాల నుంచి బలమైన అభ్యర్థులను సీటు కోసం పరిశీలించింది. కాకినాడ సిటీలో అత్యధికంగా మత్స్యకార సామాజికవర్గం ఉండడంతో వారికి తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉంది. ఈ మేరకు ఆ సామాజికవర్గం వైపే మొగ్గుచూపింది. జిల్లాలో ఒక సీటు మత్స్యకారులకు ఇవ్వడం ఆనవాయితీగా వస్తుండడంతో దాన్ని కాదనలేకపోయింది. అనేక తర్జనభర్జనల తర్వాత చివరకు మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొండబాబు పేరునే ఖాయం చేసింది. దీంతో కాకినాడ జిల్లాలో ఏడు స్థానాల్లో ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన పూర్తయింది. మొత్తం ఏడు స్థానాల్లో రెండు సీట్లను బీసీలకు కేటాయించి వెనుకబడిన వర్గాలకు టీడీపీ పెద్దపీట వేసింది. వైసీపీ కూడా ఇప్పటికే ఏడు సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. ఒక్కటంటే ఒక్క సీటు కూడా జిల్లాలో బీసీలకు ఇవ్వకుండా వారిని అవమానించింది. మొత్తం అన్ని సీట్లు ఓసీలకు కట్టబెట్టడంతో వైసీపీ తీరుపై బీసీ వర్గాలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. బీసీ వ్యతిరేక పార్టీగా వైసీపీపై కారాలు మిరియాలు నూరుతున్నారు. అటు వైసీపీలో కొన్ని సీట్లకు బీసీ అభ్యర్థులు పోటీకి సిద్ధమైనా కనీసం వారెవరినీ పరిగణలోకి తీసుకోకపోవడంపై వారంతా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది. జిల్లాలో టీడీపీ 5 జనసేన 2 స్థానాల్లో బరిలో ఉన్నాయి. ఏడు అసెంబ్లీ స్థానాల్లో రెండు ఎస్సీ, ఒకటి బీసీ, నాలుగు ఓసీలకు కేటాయించారు. ఎంపీ అభ్యర్థి తేలవలసి ఉంది. రాజమహేంద్రవరం లోక్‌సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేస్తారని సమాచారం. కోనసీమ జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు ఆరుచోట్ల అభ్యర్థులను ప్రకటించారు. మూడు ఎస్సీ, ఒక బీసీ, రెండు స్థానాలు ఓసీలకు కేటాయించారు. పి.గన్నవరం అసెంబ్లీ స్థానం విషయానికొస్తే తొలి జాబితాలో టీడీపీ తరపున సరిపెల్ల రాజేష్ అలియాస్ మహాసేన రాజేష్ పేరును ప్రకటించారు. తదనంతర పరిణామాల్లో ఆయన వైదొలగడంతో సీటును జనసేన, బీజేపీల్లో ఎవరికి కేటాయిస్తారో అన్న సందిగ్ధత నెలకొంది. జనసేనకే కేటాయించనున్నట్టు పార్టీ పెద్దలు సానుకూలంగా సంకేతాలు పంపాయి. విశ్రాంత పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణ పేరును అధిష్ఠానం దాదాపు ఖరారు చేసిందని, శనివారం లాంఛనంగా ప్రకటించనున్నట్టు సమాచారం అందింది. శనివారం మంగళగిరిలో జరిగే సమావేశంలో పాల్గొనేందుకు హరీష్‌తో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు పయనమయ్యారు.

కొత్తపేట నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలు

» అక్రమార్కులపై తక్షణం చర్యలు తీసుకోవాలి
» కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో కొత్తపేట మాజీ ఎమ్మెల్యే బండారు వినతుల అందజేత

అమలాపురం టౌన్, మార్చి 22: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ కొత్తపేట నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయని, తక్షణం చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు కోరారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో ఈ మేరకు అమలాపురంలోని కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో ర్యాంపుల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణాలోపంతో మందపల్లి, ఊబలంక, గోపాలపురం, జొన్నాడ రీచ్‌ల్లో ఇసుక, మట్టి, బొండు మట్టిని విచ్చలవిడిగా తవ్వేసి రవాణా చేస్తున్నారని ధ్వజమెత్తారు. బొబ్బర్లంక బ్యారేజీకి 500 మీటర్ల లోపులోనే ఇసుక, బొండు ఇసుక తవ్వకాలు అక్రమంగా జరుపుతున్నారని ఆరోపించారు. దీనివల్ల ధవళేశ్వరం బ్యారేజీకి ముప్పు పొంచి ఉందన్నారు. అక్రమ మైనింగ్‌తో దోచుకున్న సొమ్ముతో ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరిచే అవకాశం ఉందని, తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతున్న సిండికేట్లు, వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. నాయకులు ఆకుల రామకృష్ణ, ధర్నాల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, మాసాబత్తుల ఆనందరావు, పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబి, బూసి విష్ణు, బొక్కా కుమార్, జంపన ఫణీంద్రవర్మ, పప్పుల బుజ్జి, దాసరి గణేష్, సత్తి శ్రీనివాసరెడ్డి, ముత్యాల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, టీడీపీ నేతలు



హరీష్‌మాధుర్‌కు గజమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు

వేడుకగా హరీష్‌మాధుర్ పుట్టినరోజు

అమలాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పుట్టినరోజు శుక్రవారం వేడుకగా జరిగింది. వందలాది మంది అభిమానుల సమక్షంలో ఆయన కేక్‌లు కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. హరీష్‌మాధుర్ తొలుత అమలాపురం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి, ముస్లిం వీధిలోని శ్రీదేవి అమ్మవారు, అయినవిల్లిలోని శ్రీసిద్ధివినాయకస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు టీడీపీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో స్వాగతం పలికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సమీపంలో బాలయోగి ఘాట్‌లో తండ్రి విగ్రహానికి హరీష్ నివాళులర్పించారు. ఎర్రవంతెన వద్ద గల పార్టీ కార్యాలయంలో అభిమానుల సమక్షంలో కేక్‌లు కట్ చేశారు. తొలుత టీడీపీ అభిమానులు పెద్ద సంఖ్యలో హరీష్ మాధుర్‌కు క్రేన్ సాయంతో గజమాలతో స్వాగతం పలికి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. హరీష్ అయినవిల్లి వినాయక ఆలయంలో పూజలు జరిపించుకుంటున్న సమయంలోనే ఆయన్ను లోక్‌సభ అభ్యర్థిగా పార్టీ అధిష్ఠానం ప్రకటించడంతో అక్కడ ఉన్న అభిమానుల ఆనందానికి అవధుల్లేవు. జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో టీడీపీ, జనసేన, బీజేపీ సహా హరీష్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పుట్టినరోజు వేడుకలు జరిపారు. కొత్తపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి బండారు సత్యానందరావు, ఆకుల రామకృష్ణ హరీష్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వివిధ అసోసియేషన్ల నాయకులు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు హరీష్‌కు అభినందనలు తెలిపారు.

రబీ ధాన్యం కొనుగోలుకు
సన్నద్ధం కావాలి: జేసీ



అమలాపురం టౌన్, మార్చి 22: రైతు భరోసా కేంద్రాల ద్వారా రబీ ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆమె 2023-24 రబీ సీజను ధాన్యం కొనుగోలుకు సంబంధించిన కార్యకలాపాలపై మండలాల వారీగా సమీక్షించారు. నిర్ణీత సమయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసేందుకు వీలుగా పలు ఆదేశాలు జారీ చేశారు. మండల స్థాయి మోనటరింగ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్ మొదటి వారంలో ప్రారంభం కాబోయే ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియపై నిర్దేశిత ఆదేశాలు ఇచ్చారు.

న్యాయం చేయాలని వేడుకోలు



అమలాపురం టౌన్, మార్చి 22: న్యాయం చేయండి సార్ అంటూ రామచంద్రపురం మండలం చోడవరం గ్రామానికి చెందిన యర్రంశెట్టి సాయికృష్ణ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసనకు దిగాడు. తన ఇంటి డాక్యుమెంట్లు ఇప్పించాలని వేడుకున్నాడు. తన సమస్యపై రామచంద్రపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా, స్పందనలో అర్జీలు అందించినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తనఖా రుణం ఇప్పిస్తానని చెప్పడంతో తన ఇంటి డాక్యుమెంటును ఇవ్వగా ఇంతవరకు రుణం లేదు. డాక్యుమెంటు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయం చేసి ఆదుకోవాలని డీఆర్వో, ఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశాడు.



- పెద్దాపురం

అరచేతిలో.. అనుమతులు!

- 'సువిధ' యాప్ ద్వారా 48 గంటల్లో ప్రచార అనుమతులు
- దరఖాస్తుల పరిశీలన అనంతరం జారీ
- ఎన్నికల ప్రక్రియ సులభతరం

ఎన్నికల ప్రచారానికి సంబంధించి సమావేశం నిర్వహించాలంటే ఇదివరకూ తెల్ల కాగితంపై రాసి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు సమయం దొరికినప్పుడు అనుమతులు ఇచ్చేవారు. ఇది నాయకులకు చాలా ఇబ్బందిగా ఉండేది. ఎన్నికల సంఘం 'సువిధ' యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రచార అనుమతులు జారీకి అధికారుల వద్దకు వెళ్లాల్సిన పనిలేదు. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే అనుమతుల జారీచేస్తారు. ఇప్పటికే ఎన్నికల ప్రచార జోరు సాగుతోంది. నామినేషన్ వేయగానే అభ్యర్థులు సభలు, సమావేశాలపై దృష్టిసారిస్తారు. ర్యాలీలతో హోరెత్తిస్తారు. ఎన్నికల ప్రశాంతంగా సాగేందుకు ఎన్నికల సంఘం ప్రచార పర్వంలో నిబంధనలు విధించింది. అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా, ముందస్తు అనుమతులు పొందాల్సి ఉంటుంది. దీనికి సువిధ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

ఇలా చేయాలి..

- అభ్యర్థి తమ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్ నుంచి సువిధ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- సమావేశం నిర్వహించే వివరాలతోపాటు తమకు ఏవిధమైన అనుమతులు కావాలో వాటిని యాప్‌లో నమోదుచేయాలి.
- అనుమతులకు సంబంధించి మీ సేవ చలానా చెల్లించాలి.
- చెల్లించిన చలానా రసీదు, సువిధలో నమోదుచేసి వివరాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలి.
- దరఖాస్తు ఎన్నికల అధికారులకు చేరిన 48 గంటల్లోనే ఎటువంటి జాప్యం చేయకుండా అనుమతులు జారీచేస్తారు.
- ఏదైనా పరిస్థితిలో జాప్యం జరిగితే సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చు.

వీటన్నింటికీ అవసరమే..

ప్రచారంలో వినియోగించే కార్లు, ద్విచక్ర వాహనాలు ఇంటింటి ప్రచారానికి, ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించేందుకు, సభా నిర్వహణ, సమావేశాల ఏర్పాటు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాల ఏర్పాటు, లౌడ్ స్పీకర్లు, జెండాలు, పోస్టర్ల వినియోగం తదితర ప్రచార అవసరాల కోసం తప్పనిసరిగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఇవి పరిశీలన అనంతరం అధికారులు అనుమతులు మంజూరు చేస్తారు.

సువిధ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు సువిధ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సమయం వృథా కాకుండా ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను తీసుకొచ్చింది. యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అనుమతుల జారీ చేయడం జరుగుతుంది. అభ్యర్థులు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించాలన్నా ముందుగా అనుమతులు తప్పనిసరి.

- జే.సీతారామారావు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పెద్దాపురం

పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారానికి పవన్ శ్రీకారం

పురుహూతికా అమ్మవారికి పూజల అనంతరం వారాహి ముందుకు.. విజయ నినాదం రాష్ట్రం నలువైపులా నినదించాలి

వైసీపీ కుయుక్తులు, కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి.. పార్టీ ముఖ్యులతో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశం



పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

పిఠాపురం, మార్చి22: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తన రాష్ట్రవ్యాప్త ప్రచారాన్ని పిఠాపురం నుంచే శ్రీకారం చుట్టనున్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమశక్తి పీఠం అధిష్ఠాన దేవత పురుహూతికా అమ్మవారికి పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభిస్తారు. ఇప్పటికే పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని పవన్ ప్రకటించిన నేపథ్యంలో పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్త పర్యటనలు జరగనున్నాయి. దత్తాత్రేయ అవతారమైన శ్రీపాదశ్రీవల్లభుడి జన్మస్థలమైన పిఠాపురం నుంచి ప్రచారం ప్రారంభంతో మంచి జరుగుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎన్నికల ప్రచారం తదితర అంశాలపై మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పార్టీ ముఖ్యనేతలతో శుక్రవారం ఉదయం నుంచి వరుస సమావేశాలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పార్టీ అధ్యక్షులు, టూర్ మేనేజ్‌మెంట్ టీమ్ కన్వీనర్లు, కోకన్వీనర్లతో సమావేశమయ్యారు. తాను పోటీచేసే పిఠాపురం నుంచే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించాలని పవన్ నిర్ణయించారు. ఈ మేరకు పురుహూతికా అమ్మవారికి పూజలు చేసిన అనంతరం వారాహి వాహనం నుంచి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోనే మూడు రోజులపాటు ఉండి నియోజకవర్గ ముఖ్య నేతలు, మండల నాయకులతో భేటీలు నిర్వహిస్తారు. పిఠాపురం కేంద్రంగానే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రచారానికి రాకపోకలు సాగించనున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కేంద్ర పార్టీ కార్యాలయ వర్గాలను పవన్ ఆదేశించారు. పిఠాపురం నుంచి తాను పోటీ చేస్తున్న నేపథ్యంలో వైసీపీ ఎన్నో పన్నాగాలు, కుయుక్తులు, కుట్రలు పన్నుతోందని, దీంతో ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా నాయకులకు సూచించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించబోతున్నాయని, సమరంలో విజయం ఖచ్చితంగా మనదేనని తెలిపారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్ పాల్గొన్నారు.

కోర్టు అనుమతి ఇచ్చిన వెంటనే బాధితులకు న్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు గంగిరెడ్డి

జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ చైర్మన్ గంగిరెడ్డి

సర్పవరం జంక్షన్, మార్చి 22 : జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ బాధితులకు న్యాయం చేసేందుకు అవసరమైన చట్టబద్ధ, న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు ఆ సంస్థ చైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు తెలిపారు. శుక్రవారం సర్పవరం జంక్షన్‌లోని జయలక్ష్మి కోపరేటివ్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధితులకు శఠగోపం పెట్టిన నిందితులైన పాత చైర్మన్, వైస్ చైర్మన్‌లతోపాటు డైరెక్టర్లు, రుణగ్రస్తులకు చెందిన సుమారు రూ.500కోట్ల పైబడి స్థిరాస్తులను ప్రభుత్వ సహకారంతో సీఐడీ సహకారంతో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా గుర్తించి స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఇందులో 39 జీవోల ద్వారా సుమారు రూ.300 కోట్ల మేర సీజ్ చేసిన స్థిరాస్తుల అమ్మకానికి కోర్టులో వేసి సేల్ ఆర్డర్ కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జరిగిందన్నారు. ఈ ఆస్తులను విక్రయించుకునేందుకు కోర్టు ఉత్తర్వు ఇచ్చిన వెంటనే బాధితులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సీజ్ చేసిన ఆస్తులు, సేల్ ఆర్డర్ కోసం వేచిచూస్తున్న ఆస్తులపై బాధితులకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం నుంచి అడ్వాన్సుగా రూ.300 కోట్ల స్థిరాస్తులపై 30 శాతం జయలక్ష్మి సొసైటీకి ఇవ్వాలని ఈనెల 7వ తేదీన సీఎం జగన్‌ని కలుసుకుని వినతిపత్రం అందించడం జరిగిందన్నారు. బాధితులందరికీ ఆర్థిక న్యాయం చేయడం జరుగుతుందని, కోర్టులో న్యాయపరమైన సాంకేతిక సమస్యలు పరిష్కారం అయిన వెంటనే డిపాజిట్ చేసిన సొమ్ములను బట్టి నగదు చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సొసైటీ వ్యవహారాలన్నీ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, బాధితులు ఎటువంటి అపోహలకు గురికావద్దని కోరారు. పాలకవర్గమంతా బాధితుల ప్రయోజనార్థం పనిచేస్తున్నారని, లోన్లు తీసుకున్న వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏ సమయంలోనైనా ఆఫీసుకు వచ్చి కార్యకలాపాలను పరిశీలించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు చింతా సుబ్బారావు, కొమ్మనమంచి గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



జంట హత్యల కేసులో నిందితుడిని చూపుతున్న పోలీసులు

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, మార్చి 22: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరిగిన జంటహత్యల కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు శుక్రవారం వెల్లడించారు. కేసులో నిందితుడు నేరం అంగీకరించి స్టేట్‌మెంట్ ఇచ్చినట్టు తెలిపారు. చేబ్రోలు గ్రామానికి చెందిన లోకా నాగబాబు అదే గ్రామానికి చెందిన పెండ్యాల లోవతో 22 ఏళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నట్టు నాగబాబు తన నేరాంగీకారంలో తెలిపాడు. అయితే లోవ అదే గ్రామానికి చెందిన పోసిన శ్రీనివాస్‌తో సంబంధం ఏర్పరచుకున్నట్టు అనుమానంతో ఇద్దరూ పంటపొలాల్లో ఉండగా హత్య చేయడంతోపాటు లోవ తల్లి ఇసరపు రామలక్ష్మిపై హత్యాయత్నం చేసినట్టు పోలీసులు తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో నాగబాబును గొల్లప్రోలు పోలీసుస్టేషన్ వద్ద అరెస్టు చేసినట్టు వారు చెప్పారు. హత్యకు వినియోగించిన కత్తి, రక్తంతో తడిచిన బట్టలు, సంఘటనను వీడియో తీసిన సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు బాలురు అరెస్టు

మండపేట, మార్చి22: ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల బాలుర ముఠాను అరెస్టు చేసినట్టు మండపేట పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి తెలిపారు. ఈనెల 11న మండపేట మెయిన్‌రోడ్డులో ఉన్న మెడిప్లస్ మెడికల్ దుకాణంలో ముగ్గురు బాలురు దొంగతనం చేసేందుకు ప్రయత్నించగా సిబ్బంది పట్టుకునే ప్రయత్నంలో తప్పించుకున్నారన్నారు. ఈనెల 21న మండపేట ఏడిద రోడ్డులో ముగ్గురు బాలురు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా వారు చేసిన నేరాలను అంగీకరించారన్నారు. బాలురు ముగ్గురు మండపేట, రామచంద్రపురం, సర్పవరం పీఎస్‌ల పరిధిలో తొమ్మిది నేరాలకు పాల్పడ్డారన్నారు. ద్రాక్షారామ, గొల్లపాలెం, తునిలో చేసిన నేరాల్లో బెయిల్ తీసుకుని బయట వచ్చారన్నారు. బాలురు రామచంద్రపురంలో చేసిన దొంగతనం కేసులో రూ.వెయ్యి నగదు, సెల్‌ఫోన్, మండపేట రూరల్ పరిధిలో చేసిన దొంగతనం కేసులో రెండు బైక్స్ వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు బాలురను కోర్టుకు హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. ఎస్పీ శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణ సీఐ అఖిల్‌జమ నేతృత్వంలో పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రి రెండు బృందాలుగా ఏర్పడి బాలురను అరెస్టు చేశారు. ఈ కేసులో రెండు బృందాల్లో పాల్గొన్న పోలీసులు రమేష్, సతీష్, రమణలను ఎస్పీ అభినందించారు.

28న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

కాకినాడ సిటీ, మార్చి 22: ఈనెల 28న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలను అనుసరిస్తూ జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం నియమావళికి లోబడి ఈ సమావేశాలు జరుగనున్నామన్నారు. ఈ సమావేశాలకు సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరుకావాలని సీఈవో కోరారు.

వాడపల్లిలో ప్రొటోకాల్ నిలుపుదల

ఆత్రేయపురం, మార్చి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సార్వత్రిక ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తున్నట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా పీఆర్వో కార్యాలయాన్ని మూసివేస్తున్నామన్నారు. భక్తులకు ప్రొటోకాల్, సిఫార్సు లేఖలు, ప్రత్యేక దర్శనాలు, ఆలయ మర్యాదలను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిలుపుదల చేసినట్టు ఈవో తెలిపారు. సిబ్బంది ఎన్నికల నియమావళి పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హోలీకి ప్రత్యేక రైలు

రాజమహేంద్రవరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలును నడుపుతోంది. ఈనెల 23న రైలు నెం.07645 సికింద్రాబాద్-సంత్రాగచి, ఈ నెల 25న రైలు నెం.07646 సంత్రాగచి-సికింద్రాబాద్ రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. వీటికి విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం, సామర్లకోటలలో హాల్ట్ సదుపాయం కల్పించారు.

33 అత్యవసర సేవా విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 22: అత్యవసర సేవల్లో పనిచేస్తూ పోలింగ్ కేంద్రాలకు రాలేని ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకోవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా తెలిపారు. ఎన్నికల సంఘం సూచించిన 33 అత్యవసర సేవా విభాగాల ఉద్యోగులు.. రైల్వే, రవాణా సేవలు, పాత్రికేయులు, విద్యుత్‌శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, టెలిగ్రామ్స్, దూరదర్శన్, రేడియో ఉద్యోగులు, మిల్క్ యూనియన్లు, ఆరోగ్యశాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయానం, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక సేవలు, ట్రాఫిక్ పోలీస్, అంబులెన్స్, కారాగారాలు, ఎక్సైజ్, అటవీశాఖ, పోలీస్, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, విపత్తు నిర్వహణ వంటి శాఖల ఉద్యోగులు ఉపయోగించుకోవాలన్నారు. దీనికి అవసరమైన ఫారమ్ 12డి అందుబాటులో ఉంచుతామని ఆమె తెలిపారు.



విద్యుత్ కాంతుల్లో మేరీ మాత ఆలయం



కోరుకొండలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి సదస్యం.. వైభవంగా ఆంజనేయస్వామి వాహనంపై గ్రామోత్సవం దృశ్యం

వైభవంగా నరసింహస్వామి సదస్యం

కోరుకొండ, మార్చి22: చారిత్రాత్మక కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు రాత్రి స్వామి ఆలయ ముఖ మండపం వద్ద స్వామి వారికి సదస్యం నిర్వహించారు. వైకానస ఆగమశాస్త్రం ప్రకారం ఆగమబ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు బ్రహ్మత్వంలో ఆలయ అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో అన్నవరం దేవస్థానం వేద పండితుల సమక్షంలో స్వామి వారి సదస్యం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సదస్యం అంటే స్వామి వారి, అమ్మవారిని ఆశీనులుగావించి మంగళాశాసనం చేయడం, స్వామివారి కల్యాణం జరిగిన మూడో రోజు రాత్రి సదస్యం నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. ఏకాదశి రోజు రాత్రి కల్యాణం జరిగిన లక్ష్మీసమేత నరసింహస్వామి వారికి శ్రీ భూసమేత అనంత పద్మనాభస్వామి వారికి ఒకే వేదికపై పక్కపక్క ఆశీనులు గావించి వేద పండితులు మంగళశాసనం చేశారు. అమ్మవారి తరుపున కొందరు పండితులు, స్వామివారి తరుపున కొందరు పండితులు రెండు బృందాలుగా ఏర్పడి అమ్మవారి గుణగణాలను, స్వామి వారి గుణగణాలను కీర్తించారు. అనంతరం స్వామివారికి నాలుగు వేదాలు చదివి వినిపించారు. ఇందుకోసం అన్నవరం దేవస్థానం నుంచి ప్రత్యేకంగా వేదపండితులు వచ్చారు.

ఆంజనేయ వాహనంపై గ్రామోత్సవం

శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం రాత్రి లక్ష్మీనరసింహస్వామివారు అంజనేయ వాహనంపై ఆశీనులు గావించి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి వాహనం తమ తమ ఇళ్ల ముందుకువచ్చినప్పుడు స్వామి వారికి పండ్లు సమర్పించి మంగళనీరాజనాలు అందించి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పరాసర రంగరాజభట్టర్, పరాసర లక్ష్మీనరసింహభట్టర్, అర్చక స్వాములు, వేద పండితులు, ఆగమ బ్రహ్మ, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు రంగనాథుని కల్యాణం

శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్యకల్యాణమహోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు శనివారం రాత్రి 9 గంటలకు స్వామివారికి రంగనాథస్వామి ఆలయ సన్నిధిలో స్వామి వారికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా రంగనాథస్వామి వారి కల్యాణం కూడా నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం.

గౌరీపట్నంలో మేరీమాత ఉత్సవాలు



మాట్లాడుతున్న ఏలూరు పీఠాధిపతి జయరావు

దేవరపల్లి, మార్చి22: గౌరీపట్నం కొండపై 44 ఏళ్ల కిందట మరియమ్మతల్లి వెలిసిందని, అప్పటినుంచి ఈ ప్రాంతమంతా ఆధ్యాత్మిక నిలయంగా నిర్మలగిరి పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందిందని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. మండలంలోని గౌరీపట్నం మేరీమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రాన్ని ప్రాంతాలకు, మతాలకు అతీతంగా ప్రజలు దర్శించుకుంటారన్నారు. ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో వస్తారన్నారు. శని, ఆదివారాల్లో 3 లక్షల మంది భక్తులు హాజరవుతారని, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో క్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, ఫాదర్ బాల, ఫాదర్ మోజేష్, ఫాదర్ జార్జ్ ఫిలిప్, ధర్మరాజు పాల్గొన్నారు.



పొగాకు బ్యారన్ ద్వారం నుంచి అగ్ని కీలల దృశ్యం

దొండపూడిలో రెండు పొగాకు బ్యారన్‌లు దగ్ధం

రూ.7 లక్షల ఆస్తి నష్టం

గోపాలపురం, మార్చి22: మండలంలోని దొండపూడిలో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తూ రెండు పొగాకు బ్యారన్‌లు కాలిబూడిదయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో మద్దాల స్వాతి, పెనుభూతుల నాగజ్యోతిమౌనికలకు చెందిన పొగాకు బ్యారన్‌లలో శుక్రవారం తెల్లవారుజాము అగ్నికీలలు ఎగసిపడ్డాయి. స్థానికులు గమనించి మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు శ్రమించాల్సి వచ్చింది. బయట నుంచి మంటలను ఆర్పేందుకు వీలు లేకపోవడంతో ముఖద్వారం కిటికీల నుంచే అదుపు చేశారు. ఈ ఘటనలో మద్దాల స్వాతికి చెందిన బ్యారన్‌లో పొగాకు దగ్ధమై రూ.5 లక్షలు, నాగజ్యోతి మౌనిక బ్యారన్‌కు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది అంచనా వేసినట్టు తెలిపారు.

విపత్తు నిర్వహణశాఖ మేనేజర్‌గా లావణ్య

కలెక్టరేట్(కాకినాడ), మార్చి22 : కాకినాడ జిల్లా విపత్తు నిర్వహణశాఖ ప్రాజెక్ట్ మేనేజర్‌గా మందుల లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కృతికాశుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ ఆర్డీవోగా పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా ఆమె ఇక్కడికి వచ్చారు.



అల్లవరంలో కారును తనిఖీ చేస్తున్న ఎంపీడీవో బృందం

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

కారులో ఆధారాలు చూపని రూ.9.75 లక్షలు స్వాధీనం

అల్లవరం, మార్చి 22: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ శుక్రవారం తనిఖీలు చేపట్టింది. ఒక కారును ఆపి తనిఖీ చేయగా అందులో రూ.9.75 లక్షల నగదు కనిపించింది. హైదరాబాద్ నుంచి వచ్చి భూమి రిజిస్ట్రేషన్ కోసం అమలాపురంలో ఈ నగదు డ్రా చేసుకుని కొమరగిరిపట్నం వెళ్తున్నట్టు కారు యజమాని అధికారులకు తెలిపాడు. సరైన ఆధారం చూపించలేకపోవడంతో ఈ వ్యవహారాన్ని కలెక్టరు, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, స్వాధీనం చేసుకున్న నగదును డీఆర్డీఏ పీడీ శివశంకరప్రసాద్‌కు పంపామని ఎంపీడీవో తెలిపారు. బ్యాంకు మేనేజరు పరిశీలించారని, ఆధారాలు చూపితే నగదు తిరిగి ఇస్తామన్నారు. ఈ తనిఖీల్లో తహశీల్దారు సునీల్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శేఖర్‌బాబు, కానిస్టేబుల్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నిందితుడిని అరెస్టు చేసి చూపుతున్న జీఆర్పీ పోలీసులు

రైళ్లలో దొంగ అరెస్ట్.. సొత్తు స్వాధీనం

రాజమహేంద్రవరం, మార్చి22(ఆంధ్రజ్యోతి): రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు(జీఆర్పీ) అరెస్టు చేశారు. సీఐ విజయశంకర్ వివరాల ప్రకారం.. డీఎస్పీ ఎల్.మోహన్‌రావు ఆదేశాలతో రైళ్లలో చోరీలు చేస్తున్న వాళ్లపై నిఘా పెట్టామన్నారు. ఈ క్రమంలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేటకు చెందిన అన్నెం వీర శ్రీనివాస్‌ని అరెస్టుచేసి రూ.2.70 లక్షల విలువైన 28.70 గ్రాముల బంగారం, రెండు ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసులో ప్రతిభ చూపిన ఎస్ఐ లోవరాజు, కానిస్టేబుళ్లు వీరబాబు, రవి, రామారావు, ఆర్పీఎఫ్ సిబ్బందిని డీఎస్పీ మోహన్‌రావు, సీఐ అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి వివరాలు వెల్లడిస్తున్న సీఐ కాశీవిశ్వనాథ్

గంజాయి తరలిస్తున్న ఇద్దరు మహిళలు అరెస్టు

రాజానగరం, మార్చి 22: ట్రాలీ బ్యాగుల్లో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహిళలు మార్గమధ్యలో రాజానగరం పోలీసులకు చిక్కారు. జాతీయ రహదారిపై రాజానగరం సమీపంలోని తూర్పుగోనగూడెం వద్ద ఏర్పాటుచేసిన ఎన్నికల చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహిస్తుండగా గంజాయి వ్యవహారం వెలుగుచూసింది. ఇందుకు సంబంధించి సీఐ పి.కాశీవిశ్వనాథ్ శుక్రవారం విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజుజిల్లా చింతపల్లి మండలం కట్టుబంద గ్రామానికి చెందిన తాంబెల్లి లక్ష్మి, కొమ్మంగి పంచాయతీ పరిధిలోని చిన్న కొత్తవీధి గ్రామానికి చెందిన దిప్పల రాధా అనే మహిళలు గంజాయిని ట్రాలీ బ్యాగుల్లో నింపి చింతపల్లి నుంచి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. ముందుగా అందిన సమాచారం మేరకు తూర్పుగోనగూడెంవద్ద తనిఖీలు నిర్వహించగా బ్యాగుల్లో రూ.2.10 లక్షల విలువైన 22 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. చైన్నై తరలిస్తున్నట్టుగా నిందితులు చెప్పారన్నారు. ఎస్ఐ మనోహర్ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయితోపాటు అదుపులోకి తీసుకున్న నిందితులు

మురారిలో 23 కిలోల గంజాయి స్వాధీనం

గండేపల్లి, మార్చి 22: గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 23 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సీఐ లక్ష్మణరావు, గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వెళ్లే జాతీయ రహదారిలో మురారి గ్రామంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద జగ్గంపేటకు చెందిన కాపవరపు బాలాజీ, అతని స్నేహితుడు నైనవ వెంకట సురేష్‌లు మోటార్‌సైకిల్‌పై విశాఖ ఏజెన్సీ ప్రాంతం ధారకొండ నుంచి సుమారు 23 కిలోల గంజాయిని మోటార్ సైకిల్‌పై తరలిస్తున్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు సీఐ లక్ష్మణరావు ఆదేశాలతో గండేపల్లి ఎస్ఐ రామకృష్ణ వారిని అదుపులోకి తీసుకున్నారు. గంజాయి, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్ట ఎస్ఐ తెలిపారు.

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన

అమలాపురం టౌన్, మార్చి 22: అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు ఎస్ఎస్ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలకు ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలకు చీరలు, పంచెలు, కిరాణా సామగ్రిని పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి అనంతలక్ష్మి, కోశాధికారి విజయలక్ష్మి, పుత్సా రాజేశ్వరి, దువ్వూరి సుబ్బలక్ష్మి, శ్రీగిరి పద్మావతి, పేరి లలిత, వేదనభట్ల సాయిలక్ష్మి, రమాదేవి, శారద తదితరులు పాల్గొన్నారు.

గ్రేడ్-5 కార్యదర్శులకు పంచాయతీల బాధ్యతలు

ద్రాక్షారామ, మార్చి 22: 500 జనాభా దాటిన పంచాయతీలకు కార్యదర్శులను నియమించేందుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 11 ప్రకారం శుక్రవారం రామచంద్రపురం మండలంలో పంచాయతీలకు గ్రేడ్-5 కార్యదర్శులను నియమించారు. భీమక్రోసుపాలేనికి కుండ్ల ప్రసాద్‌రెడ్డి, అన్నాయిపేటకు ఆకుల వెంకటేష్, మాలపాడుకు కానెం పెదచిన్నిబాబు, ఆదివారపుపేటకు కొల్లి లక్ష్మణరావు, బాపనయ్య చెరువుకు గాడా మహేష్, ఓదూరుకు పంపన లక్ష్మీనారాయణ, తోటపేటకు కోట వెంకట రామకృష్ణ, ఏరుపల్లికి ఇందు సత్యదుర్గా ప్రసాద్, తాడిపల్లికి నామా త్రిచరణ్, కాపవరానికి గోనెల దుర్గా ప్రసాద్‌లను నియమిస్తూ ఎంపీడీవో ఎస్.వి.రామచంద్రమూర్తి, ప్రత్యేకాధికారి ఎం.జి.రాజులు ఉత్తర్వులు జారీ చేశారు.

కాంగ్రెస్ పార్టీ మీడియా కోఆర్డినేటర్‌గా జయ

ఉప్పలగుప్తం, మార్చి 22: కాంగ్రెస్ పార్టీ మీడియా విభాగం కోనసీమ జిల్లా కో-ఆర్డినేటర్‌గా మునిపల్లికి చెందిన దామిశెట్టి జయ నియమితులయ్యారు. ఈమేరకు పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నుంచి తనకు ఉత్తర్వులు అందాయని ఆయన చెప్పారు.

ఆరోగ్య సురక్ష శిబిరం

ఉప్పలగుప్తం, మార్చి 22: చల్లపల్లి పంచాయతీ చింతలచెరువులో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఎస్.యానాం పీహెచ్‌సీ వైద్యాధికారి ఢిల్లీ ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో కొఠారి వెంకటేశ్వరప్రసాద్ శిబిరాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వి.వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పెట్టా నాగేశ్వరరావు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ఆలమూరు, మార్చి 22: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు అనిల్‌కుమార్ కోరారు. ఓటు హక్కు ఆవశ్యకతను వివరిస్తూ శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఏప్రిల్ 15కి 18ఏళ్లు నిండిన వారందరూ ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. ర్యాలీలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ బలగాల కవాతు

అంతర్వేది, మార్చి 22: ప్రశాంత ఎన్నికల కోసం అంతర్వేదిపాలెం, టేకిశెట్టిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో సాయుధ బలగాలతో శుక్రవారం కవాతు నిర్వహించారు. సఖినేటిపల్లిలంక రేవులో ఏర్పాటుచేసిన ఓటరు అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ ఎస్.రాము మాట్లాడారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

మోరిలో రథోత్సవం



అంతర్వేది, మార్చి22: మోరి మహాలక్ష్మమ్మ, కనక మహాలక్ష్మమ్మ తీర్థ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి రథోత్సవం పురవీధుల్లో జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు ముప్పర్తివారి కుటుంబ సభ్యులు రథోత్సవం ప్రారంభించగా మోరి పురవీధుల నుంచి మోరిపోడు, మోరి, వియ్యూరివారి మెరక మీదుగా అమ్మవారి ఆలయ ప్రాంగణానికి చేరింది. అమ్మవారి ఉత్సవవిగ్రహాలను సురభి నాట్య బృందం గానాలతో గుడిలో చేర్చారు. రథోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక దేవతా విగ్రహాల ఊరేగింపు ఆకట్టుకుంది. రథోత్సవం పొడువునా బాణసంచా కాల్చారు. భక్తులు భక్తిశ్రద్ధలతో రథోత్సవంలో పాల్గొన్నారు. అమ్మవారి తీర్థ మహోత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన విద్యుద్దీపాలంకరణలు, ప్రత్యేక సెట్టింగులు ఆకర్షణీయంగా ఉన్నాయి. అమ్మవారిని పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు దర్శించుకున్నారు.

వెంకన్న ఆదాయం రూ.2.29లక్షలు

ఆత్రేయపురం, మార్చి 22: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామిని శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,29,690 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

టీడీపీ, జనసేన, బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి







మండపేట: ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరికలు, ద్రాక్షారామ: సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లింలు, ఐ.పోలవరం: బుచ్చిబాబుకు మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, మార్చి 22: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపు నిచ్చారు. మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన బూత్‌కమిటీ, సాధికారిక సారధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో బూత్‌కమిటీ సాధికారిక సారధులంతా గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు సాధికారిక సారధులు, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక: స్థానిక5,6వార్డులకు చెందిన పలువురు యువకులు కౌన్సిలర్ కాశినకాశీవిశ్వనాథ్, టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గడి రాంబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత వి.సాయికుమార్‌బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు, వాదా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వేగుళ్లను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తాం

టీడీపీ,జనసేన బీజేపీ మండపేట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించి తీరుతామని టీడీపీ మండల అధ్యక్షుడు యరగతపు బాబ్జి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీలో పదవులు అనుభవించిన కొంతమంది వైసీపీలో చేరి టీడీపీపై చేస్తున్న ఆరోపణలను బాబ్జి ఖండించారు. ద్వారపూడిలో టీడీపీ, జనసేన, బీజేపీ బలంగా ఉన్నాయన్నారు. ఎవరుఎన్ని కుయుక్తులు పన్నినా వేగుళ్ల గెలుపు ఖాయమన్నారు. తామంతా వేగుళ్ల వెంటే ఉన్నామన్నారు. సమావేశంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు అడబాల బుల్లబ్బు, కొమ్మన సూరిబాబు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే

ద్రాక్షారామ, మార్చి 22: ముస్లిం మైనార్టీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ రామచంద్రపురం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం ద్రాక్షారామలో పలువురు ముస్లింలు సుభాష్ సమక్షంలో టీడీపీ చేరారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ మైనార్టీసెల్ అధికార ప్రతినిధి ఎం.డి.బషీర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రజాఅబ్బాస్, జనసేన నాయకుడు సయ్యద్ ఫాజిల్, ఎం.డి.రియాజ్, ఎం.డి.అల్లాఉద్దీన్, ఎం.డి.భాషజాన్, ఎం.డి.రిపీ, ఎం.డి.మున్వారా పాల్గొన్నారు. అంతకుముందు జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహ మ్మద్ మీరాన్ షరీఫ్ రామచంద్రపురం పట్టణం, ద్రాక్షారామలో సుభాష్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

ఇఫ్తార్ విందులో సుభాష్: ద్రాక్షారామ జామియా జాఫరీ మసీదులో ముస్లిం ఇఫ్తార్ విందులో టీడీపీ అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

బుచ్చిబాబుకు ఎమ్మార్పీఎస్ మద్దతు

ఐ.పోలవరం, మార్చి 22: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబుకు ఎమ్మార్పీఎస్ మద్దతు ప్రకటించింది. మురమళ్లలో బుచ్చిబాబు స్వగృహానికి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారంవెళ్లి మద్దతు తెలిపారు. బుచ్చిబాబు విజయానికి పనిచేస్తామని నాయకులు అన్నారు. ఉత్తర కోస్తా జిల్లాల ఎంఎస్పీ, ఎంఆర్పీఎస్ ఇన్ చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు, జిల్లా ఎమ్మెస్పీ అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబు, జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్య క్షుడు సవరపు భైరవమూర్తి, వీధి చిరంజీవి, లంక రామకృష్ణ, ఆకుమర్తి మోహన్, ఖండవిల్లి ఏలియా, పలివెల మోహనరావు, ఉందుర్తి ప్రకాశరావు, ఉందుర్తి కిశోర్, సవరపు వెంకటరమణ, కొమ్మనపల్లి చిన్న, ముమ్మిడివరపు విక్రమ్, లంక రామారావు, ముమ్మిడివరపు చిరంజీవి, జొన్నాడ సూరిబాబు, సవరపు వెంకట్, లంక రాజు పాల్గొన్నారు.

లూయిా అంధుల పాఠశాలకు సాయం

అమలాపురంటౌన్, మార్చి22: నామన కృష్ణవేణి జ్ఞాపకార్థం పట్టణంలోని భూపయ్య అగ్రహారంలోని లూయిా అంధుల పాఠశాలకు నామన ఫౌండేషన్ చైర్మన్, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు డాక్టర్ వినోద్, సభ్యులతో కలిసి 25కూలింగ్ ఫ్లాస్కోలు, బీరువాలందించారు. ప్రిన్సిపాల్ రామాయణం శ్రీనివాస్, బండారు రామ్మోహనరావు, మట్ల సాయిరామారావు, మట్ట చిట్టిబాబు, దాసం సురేష్, రంకిరెడ్డి బుజ్జి, మట్ట చిన్నా, తిరుమనాథ మురళీకృష్ణ, నామన రమేష్, నామన శ్రీనిత్‌పాల్గొన్నారు.

కన్నుల పండుగగా సత్యనారాయణస్వామి కల్యాణం



సత్యనారాయణస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు, మార్చి 22: మాకనపాలెంలో వేంచేసి ఉన్న సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం శుక్రవారం తెల్లవారుజామున భక్తులు కన్నులపండుగగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మద్దాల సతీష్-కాత్యాయని దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణాన్ని కమణీయంగా నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాల నడుమ స్వామివారు అనంతలక్ష్మి, భూదేవిలను పరిణయమాడారు. శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, మొక్కులు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారు శుక్రవారం శ్రీఆంజనేయ పుష్పక వాహనంపై ఊరేగారు. అనంతరం షిర్డిసాయి నాట్యమండలి ప్రదర్శించిన చిల్లరకొట్టు చిట్టెమ్మ హాస్య సాంఘిక నాటకం భక్తుల మనసులను రంజింప చేసింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా హరీష్‌మాధుర్ పుట్టినరోజు వేడుకలు





రావులపాలెం: హరీష్‌మాధుర్ పుట్టినరోజు వేడుకలు, రాజోలు: హరీష్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ కేతా శ్రీను

రావులపాలెం, మార్చి 22: టీడీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా జరిపారు. రావులపాలెం టీడీపీ కార్యాలయంలో నాయకులు బండారు సంజీవ్, చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కాసురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో హరీష్ మాధుర్ పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఆయనకు పార్టీ శ్రేణులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రాజులపాలెంలో వేడుకలు

పి.గన్నవరం, మార్చి 22: టీడీపీ అమలాపురం పార్లమెంటరీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ పుట్టినరోజు వేడుకలను పి.గన్నవరంలో నిర్వహించారు. సీహెచ్‌సీలో రాజులపాలెం ఎంపీటీసీ నేలపూడి దామోదరం ఆధ్వర్యంలో రోగులకు పాలు, పండ్లు పంచారు. ఉంద్రాజవరపు బాబి, కత్తుల నాగరాజు, కుసుమ ప్రసాద్, గూటం శ్రీను, నక్కా సునీల్‌కుమార్, పెట్ల ప్రసాద్, గిడ్డి రవిరాజు, కుంచే వెంకటరమణ, గోసంగి శ్రీనివాసరావు, తరపట్ల రాజేంద్రకుమార్, పెట్ల నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌కు ఎంపీ టిక్కెట్‌పై హర్షం

రాజోలు, మార్చి 22: టీడీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్‌ను ప్రకటించడంపై ఎంపీపీ కేతా శ్రీను హర్షం వ్యక్తం చేశారు. అమలాపురంలో హరీష్‌మాధుర్ పుట్టినరోజు సందర్భంగా ఆయన హరీష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా కేతా మాట్లాడుతూ అమలాపురం టీడీపీ ఎంపీగా హరీష్‌మాధుర్ భారీ మెజార్టీతో గెలుస్తారని జోస్యం చెప్పారు. చిట్టూరి సంతోష్ తదితరులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ శుక్రవారం ప్రార్థనలు

మామిడికుదురు, మార్చి 22: రంజాన్ నెలలో రెండో శుక్రవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజులు నిర్వహించారు. మామిడికుదురులోని షియా జామియా మసీదు, సున్ని జామియా మసీదుల్లో మత ప్రబోధకుల ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. రంజాన్ నెలలో శుక్రవారం ప్రాధాన్యతను మత ప్రబోధకులు భక్తులకు వివరించారు. అధిక సంఖ్యలో ముస్లింలు నమాజుల్లో పాల్గొని ప్రార్థనలు చేశారు.



మామిడికుదురు మసీదులో నమాజు చేస్తున్న ముస్లింలు

వలంటీర్లు వాట్సాప్‌లో పార్టీ ప్రచారం చేస్తున్నారు



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకటేశ్వరరావు

మండల సమావేశంలో మెర్లపాలెం సర్పంచ్ ఆగ్రహం

ఆత్రేయపురం, మార్చి22: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో వున్నా కొంత మంది వలంటీర్లు వాట్సాప్ గ్రూపులు, స్టేటస్‌ల ద్వారా ద్వారా వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేస్తున్నారని, వాటిని తక్షణం నియంత్రించాలని మెర్లపాలెం సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ కుండా అన్నపూర్ణ అధ్యక్షతన శుక్రవారం ఆత్రేయపురం మండల పరిషత్ సమావేశం జరిగింది. తమ గ్రామంలో రూ.1.20కోట్లతో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించి ఏడాది కావస్తున్నా ముందుకు సాగట్లేదని మెర్లపాలెం ఎంపీటీసీ మెర్ల వీరబాబు అధికారులను నిలదీశారు. శివారు ప్రాంతాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. ఆసరా పథకం లబ్ధి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని డ్వాక్రా సంఘాల సభ్యులు ఆందోళన చెందుతున్నారని సర్పంచ్ పాలా నాగేశ్వరరావు సంబంధిత అధికారులపై మండిపడ్డారు. రక్షిత మంచినీటి పథకం ద్వారా మురుగునీరు వస్తోందని, ప్రజలు తాగునీరు తాగలేకపోతున్నారని.. పైపులైన్లు పాడైపోయినా అధికారులు పట్టించుకోవట్లేదని వద్దిపర్రు సర్పంచ్ జుజ్జవరపు శ్యామలహరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ సమస్యలను ప్రజాప్రతినిధులు లేవనెత్తారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నియమావళిని ప్రభుత్వ ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ప్రభుత్వ వేతనాలు పొందే వలంటీర్లు తప్పనిసరిగా పాటించాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ బోణం సాయిబాబా, వైస్ ఎంపీపీ బంగార్రాజు, పరిపాలనాధికారి సురేంద్రరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ శ్రేణుల సంబరాలు



భట్నవిల్లిలో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ శ్రేణులు

అమలాపురం రూరల్, మార్చి 22: అమలాపురం లోక్‌సభ, అసెంబ్లీ టిక్కెట్లను గంటి హరీష్‌మాధుర్, అయితాబత్తుల ఆనందరావులకు కేటాయించడంతో టీడీపీ శ్రేణులు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఇమ్మిడివరప్పాడులో శనగన మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మంద దుర్గారావు, కార్యదర్శి కుక్కల చంద్రరావు, నామాడి శాంతిబాబు, కామనగరువులో జరిగిన కార్యక్రమంలో రాజులపూడి భీముడు తదితరులు పాల్గొన్నారు. భట్నవిల్లిలో గ్రామ కమిటీ అధ్యక్షుడు మండలీక సుబ్రహ్మణ్యశర్మ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నామాడి తారక్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పుణ్యమంతుల వెంకటేశ్వరరావు, కాట్రు శ్రీనుబాబు, మల్లవరపు రాంబాబు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 22: రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల నియమావళిని పాటిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలని రిటర్నింగ్ అధికారి సుధాసాగర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి పుస్తకాలు అందజేశారు. అనుమతులు కోసం సంబంధిత పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం, మార్చి 22: మండలంలో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. లెక్కల పరీక్షకు సంబంధించి ఐదు పరీక్షా కేంద్రాల్లో 733మందికి 723మంది హాజరుకాగా పది మంది గైర్హాజరైనట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ ఎం.రామచంద్రరావు తెలిపారు. ఎక్కడా ఏవిధమైన మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ జరగలేదన్నారు.

గవర్నర్‌గా రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరణ



యానాం, మార్చి 22: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా జార్ఖండ్ గవర్నర్ రాధాకృష్ణన్ బాధ్యతలు స్వీకరించారు. పుదుచ్చేరి విమానాశ్రయం వద్ద ఆయనకు ముఖ్యమంత్రి రంగసామి, పలువురు మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం రాజ్‌భవన్‌లో రాధాకృష్ణన్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. మద్రాసు హైకోర్టు చీఫ్ జస్టిస్ గవర్నర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం గవర్నర్‌ను చీఫ్ జస్టిస్, సీఎం రంగసామి సత్కరించారు.

హనుమత్ వాహనంపై స్వామివారి ఊరేగింపు



రావులపాలెం, మార్చి22: రావులపాలెంలోని శ్రీఅలవేలు మంగ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం హనుమత్ వాహనసేవ వైభవంగా జరిగింది. ఉదయం స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, పూజలు జరిపారు. భక్తులు, గోవింద మాలధారులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి మంగళ వాయిద్యాలు, మేళతాళాల నడుమ గజవాహనోత్సవం నిర్వహించారు.

తాగునీటి కోసం మహిళల ధర్నా



అల్లవరం, మార్చి 22: తుమ్మలపల్లి పంచాయతీ బంకువారితిప్పలో తాగునీటి సమస్య అధికంగా ఉందంటూ స్థానిక మహిళలు శుక్రవారం మధ్యాహ్నం ధర్నా చేశారు. వేసవిలో తాగునీరు ఇవ్వకుంటే ఎలాగని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామితో వాగ్వివాదానికి దిగారు. ఇంటింటికీ కుళాయిలు వేయాలని, పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యకు వెంటనే పరిష్కారం చూపుతానని ఆర్‌డబ్ల్యుఎస్ జేఈ హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. ఈసందర్భంగా ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కాంగ్రెస్, బీజేపీ నుంచి వైద్యలింగం, నమశ్శివాయ పోటీ





వైద్యలింగం, నమశ్శివాయ

యానాం, మార్చి 22: పుదుచ్చేరి లోకసభ స్థానానికి ఏప్రిల్ 19న పోలింగ్ జరగనుంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కాంగ్రెస్ కూటమి అభ్యర్థిగా ప్రస్తుత లోక్‌సభ ఎంపీ, పుదుచ్చేరి మాజీ సీఎం వి.వైద్యలింగం కాంగ్రెస్ పార్టీ ఎంపికచేసింది. ఎన్డీయే కూటమి (ఎన్ఆర్‌కాంగ్రెస్, బీజేపీ తదితర) అభ్యర్థిగా పుదుచ్చేరి హోంమంత్రి నమశ్శివాయను బీజేపీ అధిష్ఠానం ఖరారు చేసింది. వీరు మూడు రోజుల్లో నామినేషన్లు దాఖలు చేయనున్నారు.

ఓటు హక్కుపై అవగాహన

అమలాపురం టౌన్, మార్చి 22: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ మున్సిపల్ కమిషనరు ఎస్.మనోహర్ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గడియార స్తంభం సెంటర్లో ప్రతిజ్ఞ చేయించారు. ప్రగతికి మెట్టు మన ఓటు-స్వచ్ఛందంగా ఓటు వేద్దాం సుపరిపాలన అందిద్దాం.... మన ఓటు మన హక్కు అంటూ నినదించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన దృశ్యం

కొత్తపేట, మార్చి 22: కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని ఆలమూరు గ్రామ ఎరుకుల సామాజికవర్గానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. శుక్రవారం వారికి వాడపల్లిలోని టీడీపీ కార్యాలయం వద్ద కొత్తపేట అసెంబ్లీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యానందరావు కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల సత్తిబాబు, చీపురుపల్లి గణేష్, వైట్ల అవినాష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిగా హరీష్ ఎంపికపై హర్షం

కె.గంగవరం, మార్చి 22: తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంట్ అభ్యర్థిగా గంటి హరీష్‌మాధుర్‌ను అధిష్ఠానం ప్రకటించడంతో మండలంలోని పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు చంద్రు వీవీఎస్ఎస్ చౌదరి, మరివాడ సూరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, గన్ని శ్రీను తదితరులు హర్షం ప్రకటించారు.

జనసేన బైకు ర్యాలీని విజయవంతం చేయండి

మలికిపురం, మార్చి 22: జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల రాజోలు ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్ శనివారం సఖినేటిపల్లి రేవు నుంచి వస్తున్న సందర్భంగా ఏర్పాటుచేసిన బైకు ర్యాలీని విజయవంతం చేయాలని జనసేన శ్రేణులు పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన జనసేన సమావేశంలో తాడి మోహన్‌కుమార్ మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలన్నారు. రావూరి నాగు, గెద్దం మహాలక్ష్మిప్రసాద్, పొన్నాల ప్రభ పాల్గొన్నారు.

అంతర్వేది: తొలిసారి నియోజకవర్గానికి శనివారం విచ్చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు స్వాగతం పలికి, సఖినేటిపల్లి రేవు నుంచి జగ్గన్నపేట(తాటిపాక) వరకు బైకు ర్యాలీ నిర్వహించాలని జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ప్రతీ గ్రామం నుంచి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు అధికసంఖ్యలో రావాలని కోరుతూ శుక్రవారం మండలంలో16గ్రామాల్లో జనసేన నాయకులు పర్యటించారు. రాష్ట్ర నాయకులు గెద్దం మహాలక్ష్మిప్రసాద్, తాడి మోహన్‌కుమార్, పొన్నాల ప్రభ, ఆకన బాబ్జినాయుడు, ఉండపల్లి అంజి, గుబ్బల ఫణికుమార్, దీపాటి నితిన్, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నీటితోనే జీవం

మలికిపురం, మార్చి 22: ప్రతీ ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్తు తరాలకు నీటిని అందించాలని జనవిజ్ఞాన వేదిక మలికిపురం మండలశాఖ అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నీటి బిందువు ఆకారంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పాడ్డారు. మలికిపురం సెంటర్‌నుంచి గుడిమెళ్లంక వంతెన వరకు ర్యాలీ సాగింది.

నైపుణ్యంతోనే పురోగతి సాధించవచ్చు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 22: విద్యతో పాటు నైపుణ్యత సాధిస్తేనే పురోగతి సాధించవచ్చని ప్రముఖ పారిశ్రామిక వేత్త వుప్పల సంతోష్‌రెడ్డి అన్నారు. స్థానిక వీఎస్ఎం కళాశాలలో నిర్వహించిన స్పార్క్ 2కే 24 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కరస్పాండెంట్ మెర్ల శివరామప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎస్.ఎన్ మూర్తి, కార్యదర్శి ఎం.సుబ్బారావు, డైరెక్టరు మధుర మీనాక్షి, ప్రిన్సిపాల్ ఎస్.ఎన్.అలీ అన్సారీ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.బాలాజీ, వి.రవీంద్ర, జి.సత్యనారాయణ, జి.సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం

కపిలేశ్వరపురం, మార్చి 22: అద్దంకివారిలంకలో శుక్రవారం మిరిమిల్లి శ్రీను నుంచి 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు అంగర ఎస్ఐ అందే పరదేశి తెలిపారు. సిబ్బందితో దాడిచేసి పాత్రలను స్వాధీనం చేసుకుని, 50లీటర్ల బెల్లం ఊటను ధ్వంసంచేశామని, శ్రీనును ఆలమూరు కోర్టులో హాజరుపర్చామన్నారు.

దేవస్థానం భూమిలో మట్టి తవ్వకాలపై కేసు

రాయవరం, మార్చి 22: మాచవరంలో వీరేశ్వరస్వామి ఆలయానికి చెందిన 31సెంట్లు భూమిలో కాలనీవాసులు మట్టిని తవ్వి చెరువుగా మార్చి, వాడకం నీరును అందులోకి మళ్లించారని ఆలయ మేనేజర్ జీవీ అప్పారావు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.నరేష్ తెలిపారు.

జిరాయితీ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలు

అయినవిల్లి, మార్చి 22: కొండుకుదురులంకలో జిరాయితీ భూముల్లో ఇసుక అక్రమంగా తవ్వకాలు చేపట్టారు. అనుమతులు ఒకచోట తెచ్చుకుని జిరాయితీ భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాల పట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నదీపాయకు గట్లు ఏర్పరిచి రైతుల భూముల్లో ఇసుక తవ్వకాలు చేపట్టి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు జిరాయితీ భూముల్లో తవ్వకాలు నిలిపివేశారని వీఆర్వో దుర్గాభవానీ తెలిపారు.

20 లీటర్ల నాటు సారా స్వాధీనం

అమలాపురం రూరల్, మార్చి 22: అమలాపురం రూరల్ శెట్టిపల్లి గ్రామంలో ఎస్ఈబీ అధికారులు సిబ్బందితో కలిసి నాటుసారా తయారీ కేంద్రాలపై దాడిచేశారు. 20లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 200లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుంకర సాయిస్వరూప్ శుక్రవారం తెలిపారు. శెట్టిపల్లికి చెందినబత్తిన సత్తిబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్టు తెలిపారు. దాడిలో హెచ్‌సీ ఏవీఎస్ రామరాజు, కానిస్టేబుల్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రెండో వార్డులో సూర్యప్రకాష్ పర్యటన

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 22: రామచంద్రపురం 2వ వార్డులో వైసీపీ అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ పర్యటించారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, వైస్ చైర్మన్ కొలమూరి శివాజీ, కౌన్సిలర్లు, దొమ్మలపాటి శ్యామ్, బొమ్ము మోహనరావు, రవిచంద్ర, మందపల్లి చిట్టిబాబు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై ప్రచారం

అల్లవరం, మార్చి 22: ప్రజలు ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలంటూ ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటా ప్రచారం చేశారు. బెండమూర్లంక పంచాయతీ పరిధిలోని ఆరగట్లపాలెంలో కొత్త ఓటు నమోదుపై సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌వీ చంద్రమౌళి, వీఆర్వో మెట్ల బాలనరసింహమూర్తి, డాక్టర్ డీవీ జనార్దనరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్‌డీ నాయుడు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: అనన్య
వెంకటరమణ	: లైన్‌మెన్
శ్రీలలిత	: గామి
శేఖర్ స్క్రీన్-1	: రజాకార్
శేఖర్ స్క్రీన్-2	: హనుమాన్
రమా	: ప్రేమలు
గణపతి	: గుంటూరు కారం
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఓం బీం బుష్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భీమా

చెత్త సేకరణ వాహనాలపై వైసీపీ రంగులు

అభ్యంతరం వ్యక్తంచేస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు

ముమ్మిడివరం, మార్చి 22: చెత్త సేకరణకు ముమ్మిడివరం నగర పంచాయతీ వినియోగిస్తున్న బ్యాటరీ వాహనాలపై వైసీపీ జెండా రంగు పోలి ఉండడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా డోర్ టూ డోర్ తడిచెత్త, పొడి చెత్త సేకరణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌వారు నగర పంచాయతీకి ఏడు బ్యాటరీ వాహనాలను సరఫరా చేశారు. నగర పంచాయతీ పరిధిలో ఏడు సచివాలయాల పరిధిలో వీటిని వినియోగిస్తున్నారు. వీటి వినియోగం పలువురు కలెక్టర్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఫిర్యాదు చేసినట్టు సమాచారం.



నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలో చెత్త తరలించేందుకు వినియోగిస్తున్న వాహనాలు